క్లుప్తంగా

పెద్దాసుపత్రిలో సపోజ్ క్రిస్మస్



వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక పెద్దాస్పత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో మంగళవారం నర్సెస్ కమిటీ ఆధ్వర్యంలో సపోజ్ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి హాజరై క్రీస్తు బోధనల గురించి వివరించారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మ, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు సావిత్రిబాయి, నాగమణి, హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్స్ సీహెచ్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

'మాంటిస్సోరీ' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వర్ణలత

కర్నూలు సిటీ: ఈ ఏడాది అక్టోబరు 29, 30 తేదీల్లో ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించిన ఆన్‌లైన్ విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షల్లో విద్యానగర్ మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం స్కూల్ కరస్పాండెంట్ కె.రాజశేఖర్, ప్రిన్సిపాల్ కె.స్వర్ణలత విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షల్లో తమ విద్యార్థులు టి.శివాని, ఎం.గంగాధర్ వీర, సుషాంత్, కె.మానస, ఎం.అర్జున్, కె.కుందనిక, టి.అర్జున్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే ఈ నెల 17న రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థి టి.అర్జున్ తృతీయ బహుమతి సాధించారన్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన



నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరింది. మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల, మాజీ మంత్రి మూలింటి మారెప్ప మద్దతు తెలిపారు.

కొనసాగుతున్న క్లాప్ ఆటోడ్రైవర్ల ఆందోళన

కర్నూలు(టౌన్): పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ క్లాప్ డ్రైవర్లు ఆందోళన కార్యక్రమాలను మంగళవారం కొనసాగించారు. స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ సంఘం నాయకులు అబ్దుల్ దేశాయ్, రాజగోపాల్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

22న సర్వసభ్య సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం ఈనెల 22న కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్య శాల (వీపీసీ) ప్రాంగణంలో ఉంటుందని జిల్లా గొర్రెలు, మేకల అభివృద్ధి విభా గం సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.సుబాన్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల అధ్యక్షులు, జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తెలంగాణలో స్వల్ప విద్యుదుత్పత్తి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో సోమవారం నుంచి మంగళవారం వరకు 0.484 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 956 క్యూసెక్కుల నీటిని వదిలారు. అలాగే బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,013 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 54.2498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 834.30 అడుగులకు చేరుకుంది.

వారంతా 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తూ ఎప్పటికైనా తమ ఉద్యోగాలు పర్మినెంట్ కాకపోతాయా అని ఎదురు చూశారు. వారికి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ మోసగిస్తూ పబ్బం గడిపారు గత సీఎం చంద్రబాబునాయుడు. జీఓ ఇచ్చి వారికి పేడీఏ, హెచ్‌ఆర్‌ఏ రాకుండా చేశారు. పాదయాత్రలో వారి బాధలు విన్న ప్రస్తుత సీఎం జగన్ ఇచ్చినట్లుగానే హామీ అమలు చేసి చూపించారు. వారి జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగేలా చేసి వారి కళ్లలో ఆనందం నింపారు. – కర్నూలు(హాస్పిటల్)



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఆనందమానందమాయె!

- కాంట్రాక్టు ఉద్యోగులకు వంద శాతం గ్రాస్ శాలరీ
- వైద్య ఆరోగ్యశాఖలో 200 మందికి లబ్ధి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేడర్లలో 21 ఏళ్ల నుంచి కాంట్రాక్టు విధానంలో 200 మంది దాకా ఉద్యోగులు పనిచేస్తున్నారు. తమ ఉద్యోగాలు ఎప్పటికైనా రెగ్యులర్ కాకపోతాయా అని వారు ఎదురు చూస్తూనే ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో వారికి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు. అధికారంలోకి వచ్చాక జీవో నెం.27 విడుదల చేసి కన్సాలిడేట్ పే ఇచ్చారు. దీనివల్ల పే డీఏ, హెచ్‌ఆర్‌ఏ రాకుండా అయిపోయింది. తమ సమస్యలపై వారు మళ్లీ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు విన్నారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చాక వారి హామీ నెలవేర్చే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే జీవో నెం.167 విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని గత సెప్టెంబర్ 14వ తేదీ నుంచి అమలయ్యేలా చేశారు. ఫలితంగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారి జీతాలు పెరుగుతున్నాయి. ఈ మేరకు వారి జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగాయి. దీంతో పాటు పలువురి ఉద్యోగాలు సైతం రెగ్యులర్ అవుతున్నాయి.

ఎంతో ఆనందంగా ఉంది

నేను 21 ఏళ్లగా కాంట్రాక్టు ఉద్యోగంలో పనిచేస్తున్నాను. అధికారంలోకి వచ్చిన పాలకులంతా మాకు న్యాయం చేస్తామని చెప్పి అన్యాయం చేసి వెళ్లిపోయారు. మొదటిసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు న్యాయం చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నం.27ను రద్దు చేసి జీఓ నం.167 విడుదల చేసి మాలో ఆనందాన్ని నింపారు. దీనివల్ల మా జీతాలు రూ.22 వేల నుంచి రూ.32 వేలకు పెరిగాయి.

– ఎన్.నిర్మల, ఎంపీహెచ్ఏ(ఎఫ్), నందికొట్కూరు యూపీహెచ్‌సీ

పేడీఏ, హెచ్‌ఆర్‌ఏ అమల్లోకి వస్తున్నాయి

రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.27 రద్దు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. దీనివల్ల మాకు పేడీఏ, హెచ్‌ఆర్‌ఏ రానున్నాయి. ఈ కారణంగా మా జీతాలు బాగా పెరుగుతున్నాయి. ఉద్యోగాలు సైతం రెగ్యులర్ కాబోతున్నాయి. ఇది కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు. –బి.మంగమ్మ, ఎంపీహెచ్ఏ(ఎఫ్), గూడూరు

జీవో నెం.27రద్దు పట్ల హర్షం



కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల గుదిబండగా మారిన జీఓ నం.27ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రద్దు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఆనందాన్నిచ్చే అంశం. దీనివల్ల 20 ఏళ్లుగా ఉద్యోగాలను నమ్ముకుని ఉన్న మాలాంటి కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు పెరిగాయి. ఇది ఎంతో సంతోషించదగ్గ అంశం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– బి.రఘుబాబు, ఏపీ జీఈఎఫ్ జిల్లా చైర్మన్, కర్నూలు

పారదర్శకంగా ఓటరు జాబితా

కర్నూలు (టౌన్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందిస్తామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవ్‌తేజ తెలిపారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఫారం 6, 7, 8 ద్వారా నమోదు చేసిన దరఖాస్తుల పురోగతి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా ఇబ్బందులు, ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విచారించి తప్పులుంటే సరిదిద్దుతామన్నారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే ఫిర్యాదు చేయండి

కర్నూలు సిటీ: మార్కెట్‌లో నాణ్యత లేని వస్తువులను అంటగట్టే వారిపై ఫిర్యాదు చేయవచ్చని జిల్లా వినియోగదారుల ఫోరం కార్యదర్శి ఎ.శివమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక సంస్థ పాఠశాలలో జాతీయ వినియోగదారుల డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మార్కెట్‌లో నాణ్యత ప్రమాణాల గురించి ప్రతి వినియోగదారుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యత కలిగిన వస్తువులను పొందటంలో ఎదుర్కొంటున్న మోసాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి పి.వి.ఎం పరమేశ్వర్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు కిరాణం షాపుల్లోనూ వివిధ షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ కొనుగోలులో ఎదుర్కొంటున్న మోసాలు వివరిస్తూ, కొలతలు, తూకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వెంకటరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

కోవిడ్ పట్ల సంసిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఇతర రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. రోగుల కోసం పడకలు, ఆక్సిజన్, కోవిడ్ టెస్టులకు ఆర్‌టీ పీసీఆర్ కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ లక్ష్యాలను పూర్తి చేసిన హెచ్‌ఓడీలను ఆయన అభినందించారు. సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీలక్ష్మిబాయి, డాక్టర్ రాధారాణి, డాక్టర్ విజయానందబాబు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన



దీక్షకు కూర్చున్న న్యాయవాదులకు మద్దతుగా శిబిరంలో పాల్గొన్న నాయకులు

కర్నూలు (లీగల్): భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌తో చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహారదీక్షలు తొమ్మిదవ రోజుకు చేరాయి. మంగళవారం నిరసన శిబిరంలో న్యాయవాదులు జావెద్ ఇమ్రాన్, రామాంజనేయులు, శ్రీకాంత్, మనోహర్, మోహన్ రెడ్డి, అయ్యస్వామి, దౌలత్, గణేష్, జయసింహ కూర్చున్నారు. రైతు సంఘం సీపీఐ జిల్లా నాయకులు జగన్నాథం, టీడీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఆనంద్ బాబు, బీజేపీ ఓబీసీ మోర్చా నారప్ప, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు నిర్మలమ్మ న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. నిరాహార దీక్షలను అధ్యక్షుడు నాగభూషణం నాయుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, శ్రీవాత్సవ, మదన్‌మోహన్ రెడ్డి, రంగారవి, కేసీ రాముడు, రవికుమార్, లక్ష్మణ్ తదితరులు విరమింపజేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడాదినోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ క్రీడాజ్యోతిని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఒత్తిడిని అధిగమించి చురుగ్గా చదువుల్లో రాణిస్తారన్నారు. అనంతరం ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, వ్యాయామ ఉపాధ్యాయులు బాదల్, స్పోర్ట్స్ కోచ్ వజ్రరాజు పాల్గొన్నారు.

ఏసు శాంతి సందేశం మహోన్నతం



మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి



క్రిస్మస్ గీతాలకు నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): ఏసు ప్రభువు మానవాళికి ఇచ్చిన శాంతి సందేశం మహోన్నతమైనదని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. మంగళవారం సాయంత్రం వారి స్వగృహంలో నగర పాస్టర్లు, వారి కుటుంబ సభ్యులతో క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యేసు పాపులను రక్షించుటకు, స్వాంతన చేకూర్చుటకు పరలోకం నుంచి వచ్చి దీనజనులను కాపాడారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు ఏసు మార్గాన్ని అనుసరించాలన్నారు. అనంతరం ఎస్వీ దంపతులకు మేలు జరగాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌డీ సజీవరాజు, జె.యెహోషువ, ఎం.రాజేంద్ర, పాస్టర్లు విలియమ్స్, జాబెజ్ వాట్స్, శ్యాంసన్, ప్రభాకర్, సుదర్శన్, జయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ క్రిస్టియన్ ఉద్యోగుల ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పవర్ ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక రాజ్‌విహార్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో జరిగిన ఈ వేడుకల్లో కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ప్రవీణ్ పగడాల, ఎస్ఏఓ రాఘవులు, విద్యుత్ క్రిస్టియన్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆనంద్ దేవపాల్, రంగస్వామి, రాజులయ్య, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

కోల్స్ చర్చిలో ఘనంగా క్యాండిల్ లైటింగ్



క్రీస్తు గీతాలను ఆలపిస్తున్న క్వయర్ బృందం

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో మంగళవారం క్యాండిల్ లైటింగ్ సర్వీస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రెవ.పీటర్ సామేల్ గొల్లపల్లి ప్రసంగిస్తూ పాపులను రక్షించుటకు యేసు మానవ రూపంలో జన్మించారన్నారు. క్వయర్ డైరెక్టర్లు రవీంద్రనాథ్, రవికాంత్, సుధీర్, ఫ్రాంక్లిన్ ఆధ్వర్యంలో క్వయర్ బృందం క్రిస్మస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు అనిల్ సామేల్, జీవన్‌రావు, పాస్కల్ ప్రకాష్, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లింకన్, జాన్ విల్సన్, చిన్న ప్రసన్న, రవిరాజు, మధుకర్, సంతోష్, స్టాండింగ్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నవరత్నాలతో తొలగిన పేదల కష్టాలు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల కష్టాలు తొలగించాయని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్దూరు నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాలు మార్చేందుకు కేవలం నవరత్నాలు చాలని చాటి చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సాహసంతో పథకాలు అమలు చేశారన్నారు. దీంతో ప్రజలు ఆర్థిక కష్టాల నుంచి బయటపడ్డారన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా పథకాలు మంజూరు చేయడం సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ ఆసీఫ్, రాజు, సునిస్, సుచరిత, అబ్బాస్ అలీ, సునిల్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలకు ప్రాధాన్యత

నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలతో పాటు వైద్య, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలు ఉంటే తనను కలిసి పరిష్కారం పొందవచ్చన్నారు.

వసతి గృహాల తనిఖీ

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు మంగళవారం ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేశారు. నగరంలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, బాల సదన్, గవర్నమెంట్ బీసీ, ఎస్సీ సంక్షేమ బా లుర వసతి గృహాలతో పాటు పెద్దపాడు, పంచలింగాల వసతి గృహాలను తనిఖీ చేశారు. సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యా ర్థుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ డీసీపీఓ శారద పాల్గొన్నారు.

కోడుమూరు - గూడూరు రోడ్డు నిర్మాణం చేపట్టండి

కర్నూలు(అర్బన్): ప్రజలకు పూర్తి ఇబ్బందికరంగా మారిన కోడుమూరు – గూడూరు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని బీజేపీ కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పుల గోపాల్ కోరారు. మంగళవారం బీజేపీ నేతలు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యంను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రూ.6 కోట్లతో పీఎంజీఎస్‌వై కింద రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, ఇప్పటికే టెండర్లు పిలిచామని ఆయన వివరించారు.

మహిళల రగ్బీ లీగ్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం అండర్–18 ఖేలో ఇండియా మహిళల లీగ్ పోటీలను స్కూల్ డైరెక్టర్ కేజే రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో 12 జట్లు పాల్గొన్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి జ్యోతి పంచలి, చంద్రశేఖర్, కార్తికేయన్, రగ్బీ ఇండియా నుంచి వికాస్, అమిత్, నోయల్ మాథ్యూస్ పాల్గొన్నారు.

22న గుంటూరులో రాష్ట్ర సదస్సు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 22న గుంటూరులో పీడీఎస్ఓ–ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో విద్యా, ఉపాధి రంగాల సంక్షోభం–పాలకుల విధానాలు అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పీడీఎస్ఓ జిల్లా కన్వీనర్ తిరుమలేష్, కోకన్వీనర్ తేజ తెలిపారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను వారు విడుదల చేశారు. విద్యా, ఉపాధి అవకాశాల కోసం యువత ఎదురు చూస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

'అగ్రసేని'పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(టౌన్): అక్రమాలకు పాల్పడిన అగ్రసేని రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు వీవీ నాయుడు, రాజేంద్రప్రసాద్ తదితరులు స్థానిక నగరపాలక సంస్థ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా పొల్యూషన్ డే



పరుగు పందెంలో పాల్గొన్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

కర్నూలు(టౌన్): నగరంలోని స్థానిక పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం పొల్యూషన్ డేను ఘనంగా నిర్వహించారు. పొల్యూ షన్ డేను పురస్కరించుకుని ఆ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ కార్యాలయ ఈఈ రమేష్, రీజినల్ కార్యాలయ ఈఈ మునిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అన్నారు. పొల్యూషన్ డేను పురస్కరించుకుని ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పరుగుపందెం, చెస్, క్యారమ్స్ వంటి క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సుధాకర్, శ్యామ్ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి వైద్యపరికరాలు విరాళం



సక్షన్ ఆపరేటర్లతో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, తదితరులు

కర్నూలు (హాస్పిటల్): స్థానిక పెద్దాస్పత్రికి పలు వైద్య పరికరాలు విరాళంగా వచ్చాయి. వీటిని సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి అందుకున్నారు. కిమ్స్ హాస్పిటల్ వారు రెండు సక్షన్ ఆపరేటర్లను అందజేయగా.. వాటిని ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్, న్యూరో సర్జన్ ఆపరేషన్ థియేటర్లలో అమర్చారు. నోబుల్ నర్సింగ్ హోమ్ వారు రెండు సక్షన్ ఆపరేటర్లు, పది బీపీ ఆపరేటర్లను విరాళంగా ఇచ్చారు. వీటిని అవసరమైన విభాగాల్లో ఏర్పాటు చేశారు.

వైభవంగా కుంభోత్సవం



కుంభోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



సుంకులమ్మవ్వ ఆలయానికి కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆదోనిరూరల్: మండలంలోని మాంత్రికి గ్రామంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక ఈశ్వర స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శివారులోని సుంకులమ్మవ్వకు కుంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. వేల సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా వరాలిచ్చే అమ్మవారిగా ఇక్కడి సుంకులమ్మ ప్రసిద్ధి చెందింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.